క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు–1 సచివాలయం పరిధిలో శనివారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కార్యక్రమానికి హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు.

సీనియర్ సివిల్ జడ్జిగా కొడాలి దీపా దైవకృప



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరుకు చెందిన కొడాలి దీపా దైవకృప సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం కోనసీమ అంబేద్కర్ జిల్లా ఆలమూరులోని కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమె పదోన్నతిపై కాకినాడ జిల్లా పెద్దాపురం కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి దీపా దైవకృప తల్లిదండ్రులు కొడాలి సత్య ప్రభాకరరావు, విజయకుమారిని గ్రామస్తులు అభినందించారు. సాధారణ కుటుంబంలో జన్మించిన దీపా దైవకృప న్యాయశాస్త్రంలో డాక్టరేట్ పట్టా సాధించడంతో పాటుగా న్యాయమూర్తిగా ఎంపిక కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని పాళ్ల బజారు, వికాస్ స్కూల్ రోడ్డు, నందమూరి ప్రసాదరావు రోడ్డు, సాయిబాబా ఆలయం ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

పోరంకిలో..

పెనమలూరు: పోరంకి ప్రాంతంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ శనివారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు. దీంతో నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మినగర్, వసంతనగర్, విష్ణుపురంకాలనీ, లక్ష్మిపురంకాలనీ, సాయినగర్, ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తామని స్థానికులు సహకరించాలని కోరారు.

29న ఎస్ఆర్ఆర్‌లో అంతర్జాతీయ వెబినార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు వెబినార్‌లు దోహదపడతాయని కళాశాల రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ వెబినార్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. డాక్టర్ కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల ప్రిన్సిపాల్ కె భాగ్యలక్ష్మితో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 29న కళాశాలలో ఎక్స్‌ప్లోరింగ్ రీసెర్చ్ ట్రెండ్స్ ఇన్ కెమిస్ట్రీ అండ్ బయో కెమిస్ట్రీ అంశంపై అంతర్జాతీయ వెబినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

జగనన్నతోనే సంక్షేమ కాంతులు

ఉయ్యూరు: జగనన్నతోనే సంక్షేమ కాంతులు ఉంటాయని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని అన్నారు. పట్టణంలోని 15, 16 వార్డుల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయా వార్డు సచివాలయాలను సందర్శించి సంక్షేమ అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించారు. జగనే ఎందుకు కావాలనే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. 16వ వార్డులో సహపంక్తి భోజనం చేసి పల్లెనిద్ర చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, కౌన్సిలర్లు ఎం.లక్ష్మి, డాక్టర్ జంపాన పూర్ణిమ, ఎండీ బేగ్, గుంజా సుధాకర్, రాజులపాటి చిన్ని, తెనాలి పద్మావతి, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు, సచివాలయ కన్వీనర్ వణుకూరు సురేష్ పాల్గొన్నారు.



ఉయ్యూరులో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని

నవరత్నాలు, సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థికాభివృద్ధి

ఉంగుటూరు: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న నవరత్నాలు, సంక్షేమ పథకాలు ప్రజల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. మండలంలోని ఆముదాలపల్లిలో పల్లెకుపోదాం, ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ఆముదాలపల్లిలో వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రూ.13,84,91,641 లబ్ధి చేకూరిందని తెలిపారు. ఇళ్ల స్థలాలు, జగనన్న విద్యా కానుక, నగదు బదిలీ, జగనన్నతోడు, జగనన్న గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, కంటి వెలుగు వంటి పరోక్ష ప్రయోజనాలు రూ.6,17,55,274 వెరసి మొత్తం రూ.20కోట్లు లబ్ధి కలిగిందని ఎంపీడీఓ వివరించారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి అని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం ఆ గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం వివరాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వింత శంకర్‌రెడ్డి, ఎంపీడీఓ శేషగిరిరావు, ఈఓ ఆర్‌డీ బాషా, కార్యదర్శి సాయిబాబా పాల్గొన్నారు.



ఉంగుటూరు మండలం ఆముదాలపల్లిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన ఎంపీపీ, ఎంపీడీఓ

కంకిపాడులో..

కంకిపాడు: జగన్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని దావులూరు సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు సచివాలయాన్ని సందర్శించి సంక్షేమ బోర్డు ఆవిష్కరించారు. ప్రధాన సెంటరులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. అగ్రి బోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటీ నెరవేర్చి ప్రజాసంక్షేమానికి ముఖ్యమంత్రి జగనన్న బాటలు వేశారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను తిరిగి అధికారంలోకి తెచ్చుకుంటేనే సంక్షేమ పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, సర్పంచ్ కొప్పుల లక్ష్మి, చలివేంద్రపాలెం సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, నాయకులు కె.సీతారామయ్య, మసిముక్కు సాంబశివరావు, ఈఓ కూర్మారావు పాల్గొన్నారు.



దావులూరులో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఇంటింటికీ సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

హనుమాన్‌జంక్షన్ రూరల్: గడిచిన నాలుగున్నర ఏళ్ల వైఎస్సార్ సీపీ పాలన సంక్షేమంలో స్వర్ణ యుగం లాంటిదని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలం బండారుగూడెం సచివాలయం ప్రాంగణంలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల జీవన స్థితిగతులు మార్చడమే అసలైన అభివృద్ధిగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. జేసీఎస్ మండల కన్వీనర్ ఆవిర్నేని శేషగిరిరావు మాట్లాడుతూ బండారుగూడెం సచివాలయం పరిధిలో గడిచిన నాలుగున్న ఏళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా వివిధ పథకాల లబ్ధిదారులకు రూ. 14.76 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా మరో రూ.8.20 కోట్ల మేర నగదు పంపిణీ జరిగిందని వివరించారు. తొలుత సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గూర్చి వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీటీసీ సభ్యురాలు మౌనిక, సర్పంచ్ అమ్మాజీ, మాజీ సర్పంచ్ తిరుపతిరావు పాల్గొన్నారు.

పెనమలూరులో..

పెనమలూరు: జగనన్న పాలనలోనే పేద, మధ్య తరగతి కుటుంబాలకు సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సంగెపు శ్రీనివాసరావు అన్నారు. చోడవరంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించి సంక్షేమ పథకాలు అమలు చేసిన బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోడవరంలో నాలుగున్నర సంవత్సరాలలో రూ.26 కోట్లు సంక్షేమ పథకాల కింద పేదలకు ఆర్థిక సాయం ప్రభుత్వం అందించిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాలను పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఈఓ ప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు అండగా జగనన్న

పేదలకు జగనన్న అండగా ఉన్నారని తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్ అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరు 3వ సచివాలయంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ ఎస్.విజయలక్ష్మి, నాయకులు వేమూరి బాలకృష్ణ, చాంద్‌బాషా, తుమ్మల వరదీష్, శ్రీరాములు పాల్గొన్నారు.

బొల్లపాడులో..

ఉయ్యూరు: మండలంలోని బొల్లపాడులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ తుమ్మూరు సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం, ఏఎంసీ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దాసే రవి, సచివాలయాల కన్వీనర్ యార్లగడ్డ సాయి, పార్టీ శ్రేణులతో కలిసి సచివాలయాన్ని సందర్శించారు. సంక్షేమ బోర్డు ఆవిష్కరించి, గ్రామ కూడలిలో పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలో వివరించారు.

పేదల జీవన ప్రమాణాలు మెరుగు

అంబాపురం(విజయవాడరూరల్): పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడేవిధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నందును వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరముందని విజయవాడ వ్యవసాయమార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలంలో మొదటిగా అంబాపురంలో ఏపీకి జగనే ఎందుకు కావాలనే కార్యక్రమం సర్పంచ్ గండికోట సీతయ్య అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా వల్లభనేని వంశీమోహన్‌ని గెలిపించాలన్నారు. తొలుత సంక్షేమ పథకాల బోర్డును, అనంతరం నాయకులు వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీలం రంగారావు, గన్నవరం వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ అంజనీకుమారి, మాజీ ఎంపీపీ రూబేన్, మండల సచివాలయాల కన్వీనర్ వెంకటేశ్వరావు, ఉపసర్పంచ్ శ్యామల పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

అజ్జంపూడి(గన్నవరం): మండలంలోని అజ్జంపూడిలో శుక్రవారం పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, సర్పంచ్ కంచర్ల చిన్నా ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. నాయకులు దొడ్ల జోగేశ్వరరావు, రాజశేఖర్ పాల్గొన్నారు.



బండారుగూడెంలో మాట్లాడుతున్న జేసీఎస్ మండల కన్వీనర్ శేషగిరిరావు



చోడవరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు



గన్నవరం మండలం అజ్జంపూడిలో పార్టీ జెండా ఆవిష్కరణలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్‌రాణి



అంబాపురంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కనులపండువగా భద్రాద్రి రాముని కల్యాణోత్సవం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో భద్రాచల సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. హిందూ ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక రథంపై భద్రాచల సీతారామచంద్ర స్వామి నమూనా దేవస్థానం, ఉత్సవ మూర్తులు హనుమాన్‌జంక్షన్‌కు విచ్చేశారు. తొలుత భద్రాద్రి రాముని రథం ఊరేగింపు పురవీధుల్లో నిర్వహించారు. జై శ్రీరామ్ నినాదాలతో భక్తులు ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళల కోలాట ప్రదర్శన, భక్తి గీతాలాపన ఊరేగింపునకు ప్రత్యేక ఆకర్షణగా నిల్చింది. అనంతరం అభయాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆధ్యాత్మిక వేదికపై భద్రాచల సీతారాముల కల్యాణం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కనులపండువగా సాగింది. సీతారాముల కల్యాణం తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. భద్రాచల క్షేత్రం నుంచి వచ్చిన అర్చకులు ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రముఖ పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ ఆర్థిక సాయంతో అన్నదానం చేశారు. సీతారాముల కల్యాణోత్సవం దాతలు అడ్వొకేట్ బీవీ కృష్ణారెడ్డి (ఏలూరు), గుత్తా శ్రీనివాసరావు, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, కార్యనిర్వాహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.



హనుమాన్‌జంక్షన్‌లో భద్రాద్రి రాముని కల్యాణం

జాగ్రత్తలతో అనారోగ్య సమస్యలు దూరం

పెనమలూరు: పీరియడ్స్ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే అనారోగ్య సమస్యలు రావని డాక్టర్ ఎం.పావని అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఎన్ఎస్ఎస్, అను మై బేబీ ఆస్పత్రి సహకారంతో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని మాట్లాడుతూ పీరియడ్స్ సమయంలో శానిటరీ నాప్కిన్స్ వాడిన సమయంలో సరైన పద్ధతి పాటించి డిస్పోజ్ చేయాలన్నారు. పీరియడ్స్ నివారించటానికి పిల్స్ వాడటం సరి కాదన్నారు. పీరియడ్స్ సమయంలో సమస్యలు వస్తే తల్లితో షేర్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మౌనిక, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ పావని

కుల గణనతో బీసీ వర్గాలకు న్యాయం

కంకిపాడు: బీసీ కులగణనతో బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుందని సగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు అన్నారు. కోలవెన్ను పంచాయతీలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 92 ఏళ్ల తరువాత కులగణనకు ప్రభుత్వం ముందుకు రావటం హర్షణీయమన్నారు. గణనతో బీసీ కులాలన్నింటికీ గుర్తింపు వస్తుందన్నారు. బీసీ వర్గాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాయన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, సర్పంచ్ సురేష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు ఉమాదేవి, మాజీ సర్పంచ్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సగర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు

భద్రాద్రి సీతారామచంద్రస్వామి అష్టబంధన

నున్న(విజయవాడరూరల్): బోడపాడు గ్రామంలోని భద్రాద్రి సీతారామచంద్రస్వామి అష్టబంధన కార్యక్రమం శుక్రవారం జరిగింది. స్వామికి మహాసంప్రోక్షణ కుంభాభిషేకం కార్యక్రమాన్ని అర్చకస్వాములు వైఖానస శాస్త్ర ప్రకారం నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్నిధ్యానం, కుంభారాధన, హోమాలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రొంపిచర్ల లోకాభిరాము, ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.



భద్రాద్రి సీతారామచంద్రస్వామి

నెట్‌బాల్ పోటీల్లో బాపులపాడు విద్యార్థుల ప్రతిభ

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో బాపులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో రాణించారని హెచ్‌ఎం తోట వెంకట నాగేశ్వరరావు, మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ పామర్తి వెంకటేశ్వరరావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్‌జిల్లాల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–19 జిల్లా బాలుర జట్టుకు బాపులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి షేక్ హనీఫ్ ప్రాతినిధ్యం వహించాడని తెలిపారు. ఈ పోటీల్లో హనీఫ్ అత్యుత్తమ ప్రతిభ చాటడంతో పాటుగా జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిల్చిందన్నారు. అండర్–14 బాలికల విభాగంలో తృతీయ స్థానం సాధించిన కృష్ణా జిల్లా జట్టుకు పాఠశాల విద్యార్థిని నడకుదురు హిమబిందు ప్రాతినిధ్యం వహించినట్లు పేర్కొన్నారు. వీరితో పాటుగా రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో సాఫ్ట్ బాల్, బెస్‌బాల్, నెట్‌బాల్ క్రీడల్లో పాల్గొన్న పలువురు విద్యార్థులను పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.



నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రతి పేద కుటుంబానికి రెండెకరాల భూమి ఇవ్వాలి

కంకిపాడు: ప్రతి పేద కుటుంబానికి రెండెకరాల భూమి ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంటూరి ఏలియా డిమాండ్ చేశారు. సమితి జిల్లా స్థాయి విస్తృత సమావేశం కంకిపాడులో శుక్రవారం నిర్వహించారు. ఏలియా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి రిజర్వేషన్ ఫలాలు అందేలా చూడాలన్నారు. న్యాయవాది మోర్ల శ్రీనివాసరావు, సమితి నాయకులు కుంభా ప్రభుదాసు, ఉయ్యాల ఏడుకొండలు, వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, నాగరాజు, వెంకట శివయ్య, ప్రకాశరావు, లాం ప్రతాప్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వినియోగదారుల శ్రేయస్సే లక్ష్యం



రామవరప్పాడు: వినియోగదారుల శ్రేయస్సే లక్ష్యంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పని చేస్తుందని జోనల్ హెడ్ ఎం.రవీంద్రబాబు అన్నారు. రామవరప్పాడు రింగ్ సమీపంలోని ఓ హోటల్లో శుక్రవారం యూనియన్ బ్యాంక్ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ 19.80 లక్షల కోట్లతో గ్లోబల్ బిజినెస్‌తో 5వ అతిపెద్ద పబ్లిక్ సెక్టార్ బ్యాంక్‌గా, 75వేల మంది ఉద్యోగులతో సేవలందిస్తున్నట్లు తెలిపారు. రీజనల్ హెడ్ ఎం.శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ మణిమేకలై పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయం



గన్నవరం: క్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమని గుంటూరుకు చెందిన బిషప్ బి.జాకబ్ పేర్కొన్నారు. స్థానిక చింతలపేటలోని చర్చ్ ఆఫ్ లివింగ్ గాడ్ మినిస్ట్రీస్ మందిరంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలకు అనుగుణంగా ప్రతిఒక్కరు ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం సంఘ కాపరి ఎస్. జోసఫ్‌రాజు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. పాస్టర్ జాన్సన్, సంఘ పెద్దలు దేవరపల్లి విక్టర్‌బాబు, పులి శ్రీనివాస్, అశోక్‌రాజ్, విష్ణు, యూత్ సభ్యులు శశి, బెన్ని, రాజేష్ పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ



గన్నవరం రూరల్: బాలలు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని గోపవరపుగూడెం సర్పంచ్ నల్లూరి వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. గ్రామంలోని బాలలకు ఆయన వాలీబాల్ కిట్లు శుక్రవారం వితరణగా అందజేశారు. ఉపసర్పంచ్ దొండపాటి నిర్మల, వార్డు సభ్యులు కొలుసు అంకాలు, చిట్టినేని కార్తిక్, కందుల రంగనాయకమ్మ పాల్గొన్నారు.

గోరుముద్దను సద్వినియోగం చేసుకోవాలి



కంకిపాడు: గోరుముద్ద కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పలూరు సర్పంచ్ లాం సోనియా అన్నారు. మండలంలోని ఉప్పలూరులోని ఎంపీపీ, ఆర్‌సీఎం పాఠశాలల్లో వంట ఏజెన్సీ కార్మికులకు శుక్రవారం వంటపాత్రలను పంపిణీ చేశారు.

వైఎస్సార్ బీమా అందజేత



పెనమలూరు: పెనమలూరులో బాధిత కుటుంబాలకు శుక్రవారం గ్రామ సర్పంచ్ భాస్కరరావు వైఎస్సార్ బీమా పథకం కింద ఆర్థిక సాయం అందించారు. పెనమలూరుకు చెందిన లింగాల వెంకటేశ్వరరావు వణుకూరు గ్రామంలో కొద్ది రోజుల క్రితం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా కింద మట్టి ఖర్చులకు రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో ఈఓ సుభాని, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రైడే



గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నీటి నిల్వలు ఇళ్లల్లో, బయట లేకుండా చూసుకోవాలని ప్రచారం నిర్వహించారు. దోమ గుడ్లు పెట్టే ప్రదేశాలను శుభ్రం చేయాలని అవగాహన కల్పించారు.